సాక్షి
హనుమకొండ
బుధవారం । 24 । సెప్టెంబర్ । 2025



సీఓఈ..హుష్ కాకి

అధికారుల అలసత్వంతో ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఏర్పాటు చేసిన సీఓఈ (బాలుర) కళాశాలను కరీంనగర్‌కు మార్పు చేస్తూ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. - 8లో▸



నాకోసం కాదు.. నీకోసం

నేడు జాతీయ సేవా పథకం ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కేయూ పరిధిలోని కళాశాలల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. - 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
$31^0/24^0$

జిల్లాలో ఉదయం ఆహ్లాదకర వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం ఎండగా ఉంటుంది. సాయంత్రం పలుచోట్ల ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

రైతు సదస్సుకు తరలిరావాలి



ఖిలా వరంగల్: హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఈనెల 28న నిర్వహించనున్న రైతు సదస్సుకు తరలిరావాలని హైకోర్టు రిటైర్డ్ జడ్జి జస్టిస్ బి.చంద్రకుమార్ పిలుపునిచ్చారు. ఈమేరకు మంగళవారం వరంగల్ అబ్బనికుంటలోని తెలంగాణ రైతు సంఘం భవనంలో ఆయన సదస్సు కరపత్రాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. ప్రజా సమస్యలపై ఉద్యమిస్తున్న వారిని అణచివేయడంతోనే దేశంలో తీవ్ర సంక్షోభం ఏర్పడి నిరుద్యోగం పెరిగిపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ, సోమ రామ్మూర్తి, సోమిడి శ్రీనివాస్, ఓడెల రాజయ్య, సిరిల రవీందర్, నాగేశ్, నరసింహ, భాస్కర్ పాల్గొన్నారు.

జాగ్రత్తలు పాటించాలి



వరంగల్ క్రైం: దేవీ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మండపాల నిర్వాహకులు జాగ్రత్తలు పాటించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ సూచించారు. బతుకమ్మ ఆట స్థలాలు, మండపాలు ఏర్పాటు చేసిన ప్రాంతాల్లో పోలీసులు భద్రతా ఏర్పాట్లు పర్యవేక్షిస్తూ, పెట్రోలింగ్, విజిబుల్ పోలీసింగ్ నిర్వహిస్తూ ప్రజల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు ఆయన పేర్కొన్నారు. అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా వేడుకలు జరిగే అన్ని ప్రాంతాల్లో పోలీసు యంత్రాంగం గట్టి భద్రతా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. అలాగే, ఉత్సవాలు సజావుగా జరిగేందుకు ప్రజలు పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అగ్ని ప్రమాదాలు లేదా ఇతర అత్యవసర పరిస్థితులను ఎదుర్కోవడానికి తగిన ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని, ప్రజలు అప్రమత్తంగా ఉండి అనుమానాస్పద వ్యక్తులు లేదా కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని సీపీ కోరారు.

108, 102 సేవలు వినియోగించుకోవాలి



ఎంజీఎం: ప్రజలు 108, 102 సేవలను వినియోగించుకోవాలని హనుమకొండ జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ అప్పయ్య సూచించారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో జిల్లాలో 108, 102 సేవలపై మంగళవారం ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ అప్పయ్య మాట్లాడుతూ వైద్య ఆరోగ్య సిబ్బందితో 108 సిబ్బంది సమన్వయంతో ఉంటూ శిక్షణ పొందిన, నిపుణులైన సిబ్బంది కలిగి ఉన్న 108 సేవలను ప్రజలు వినియోగించుకునేలా చూడాలన్నారు. అనంతరం వరంగల్ క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ నసీరుద్దీన్ వాహనాల వారీగా అందిస్తున్న సేవలను వివరించారు. జిల్లాలో 108 వాహనాలు 17, 102 వాహనాలు 7 ఉన్నాయని పేర్కొన్నారు. ఆగస్టులో 1,827 మంది 108 వాహనాల సేవలు వినియోగించుకున్నట్లు పేర్కొన్నారు. ప్రోగ్రాం అధికారులు డాక్టర్ మంజుల, డాక్టర్ ఇక్తాదర్ అహ్మద్ , డెమో అశోక్‌రెడ్డి, హనుమకొండ జిల్లా కోఆర్డినేటర్ ఎం.శ్రీనివాస్, వరంగల్ కోఆర్డినేటర్ భరత్‌కుమార్ పాల్గొన్నారు.

నాటక రంగాన్ని బతికించాలి



హన్మకొండ కల్చరల్: నాటక రంగాన్ని బతికించాలని నాటక సమాజాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఆకుల సదానందం అన్నారు. హనుమకొండలోని కాళోజీ కళాక్షేత్రంలో తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ, ఎఫ్‌డీసీ ఆధ్వర్యంలో ఆకుల సదానందం, వనం లక్ష్మీకాంతరావు అధ్యక్షతన పందిళ్ల శేఖర్‌బాబు స్మారక రాష్ట్రస్థాయి నాటకోత్సవం మంగళవారం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా వారు హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడారు. పందిళ్ల శేఖర్‌బాబు రెండు తెలుగు రాష్ట్రాల్లో నాటక ప్రస్థానంలో తన ముద్ర వేసుకున్నారని తెలిపారు. అతిథులు తడకమళ్ల రామచంద్రరావు, శ్యాంప్రసాద్, పందిళ్ల అశోక్‌బాబు మాట్లాడుతూ ప్రభుత్వం నాటకరంగానికి తగిన గుర్తింపు ఇవ్వాలని కోరారు. అనంతరం కరీంనగర్‌కు చెందిన చైతన్యభారతి కళాకారులు ప్రదర్శించిన ఖరీదైన జైళ్లు, జడ్చర్ల కళాకారులు ప్రదర్శించిన మై రావణ పౌరాణిక పద్య నాటకం విశేషంగా అలరించాయి. కార్యవర్గ సభ్యులు దేవరరాజు రవీంద్రరావు, మాడిశెట్టి రమేశ్, సీత వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మేడారంలో అభివృద్ధి పనులు పరిశీలిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి



సభకు వచ్చిన మహిళలతో కరచాలనం చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి



సరికొత్త మేడారం..!

వనదేవతల ప్రాంగణం విస్తరణ, పునర్నిర్మాణానికి శ్రీకారం



సమ్మక్క గద్దె వద్ద సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ధనసరి సీతక్క, కొండా సురేఖ, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఎంపీలు పోరిక బలరాంనాయక్, కడియం కావ్య, ఎమ్మెల్యేలు

- మాస్టర్‌ప్లాన్‌ను విడుదల చేసిన సీఎం రేవంత్‌రెడ్డి
- సమ్మక్క, సారలమ్మకు మొక్కుల సమర్పణ
- అభివృద్ధి పనులు పరిశీలించి మంత్రులకు సూచనలు
- గిరిజన సంప్రదాయాల ప్రకారమే పనులు సాగుతాయని స్పష్టీకరణ
- రెండు గంటలపాటు సాగిన ముఖ్యమంత్రి పర్యటన

ములుగు: తెలంగాణ కుంభమేళా, వనదేవతల జన జాతర మేడారం రూపుమారనుంది. సమ్మక్క,సారలమ్మ ప్రాంగణాన్ని సరికొత్తగా తీర్చిదిద్దేందుకు రూపొందించిన మాస్టర్‌ప్లాన్‌ను ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి మంగళవారం ఆవిష్కరించారు. వచ్చే జనవరిలో జరిగే మహాజాతరకు శాశ్వత నిర్మాణాలు చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈసారి రూ.150 కోట్లు విడుదల చేసింది. ఈ నిధులతో చేపట్టిన పనుల పరిశీలనకు మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డి మేడారం సందర్శించారు. తల్లుల దర్శనం, మొక్కుల చెల్లింపు, పనుల పరిశీలన, బహిరంగ సభలో ప్రసంగం మొత్తంగా ఆయన పర్యటన మేడారంలో 2.04 గంటలపాటు కొనసాగింది. సీఎంతోపాటు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర పంచాయతీ రాజ్‌శాఖ మంత్రి ధనసరి సీతక్క, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, మహబూబాబాద్, వరంగల్ ఎంపీలు పోరిక బలరాం నాయక్, కడియం కావ్య, ఎమ్మెల్యేలు గండ్ర సత్యనారాయణరావు, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కడియం శ్రీహరి, కేఆర్ నాగరాజు, నాయిని రాజేందర్‌రెడ్డి, కలెక్టర్ దివాకర టీఎస్, ఎస్పీ శబరీష్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కల్యాణి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, డీసీసీ అధ్యక్షుడు పైడాకుల అశోక్ తదితరులు ఉన్నారు.

సంప్రదాయంలో వీసమెత్తు తేడా రాకుండా నిర్మాణాలు
–ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

మేడారం ప్రపంచంలోనే అతిపెద్ద గిరిజన జాతరగా గుర్తింపు పొందింది. తెలంగాణ ప్రజల ఆత్మీయత, భక్తి, సంప్రదాయాలకు ప్రతీక. వనదేవతల ఆలయాన్ని శాశ్వత ప్రాతిపదికన అభివృద్ధి చేయాలని నిర్ణయించాం. సంప్రదాయానికి గౌరవం ఇవ్వాలనే ఆలోచనతో అందరి అభిప్రాయాలు తీసుకునేందుకు ఇక్కడికి వచ్చాం. ప్రపంచంలో ఎక్కడాలేని విధంగా ప్రకృతి ఒడిలో ఉన్నట్టుగా సమ్మక్క–సారలమ్మ ఆలయం ఉంది. ప్రకృతి వైపరీత్యాలను తట్టుకునేలా నిర్మాణాలు చేపట్టేలా ప్రణాళికలు సిద్ధం చేశాం. ఆదివాసీ పోరాట చరిత్రను, స్ఫూర్తిని భవిష్యత్ తరాలకు అందించాల్సిన అవసరం ఉంది. జంపన్న వాగులో నీటి నిల్వ ఉండేలా సాగునీటిపారుదల శాఖ అధికారులు ప్రణాళికలు రూపొందించాలి.



సభలో ప్రసంగిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

జాతర ప్రాశస్త్యం గుర్తుండి పోయేలా ప్రణాళిక: మంత్రి ధనసరి సీతక్క

జాతర ప్రాశస్త్యం అనేక శతాబ్దాలు గుర్తుండి పోయేలా ప్రణాళిక రూపొందించి మేడారంలో అభివృద్ధి పనులు చేయనున్నాం. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన అనంతరమే మేడారం ప్రాంతాన్ని అభివృద్ధి పరచాలని స్వయంగా ముఖ్యమంత్రితో చర్చించాం. సీఎం సానుకూలంగా స్పందించి అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డికి తల్లుల ఆశీర్వాదం ఎల్లప్పుడూ ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నా. గద్దెల విస్తరణ విషయంలో అనేక అపోహలు ఉన్న నేపథ్యంలో నిర్మాణం ఏ విధంగా జరగాలని, గిరిజనుల ఆచార సంప్రదాయాలకు ఎలాంటి భంగం వాటిల్లకుండా చూడడం కోసం సీఎం స్వయంగా మన ప్రాంతానికి రావడం సంతోషంగా ఉంది.



బహిరంగ సభలో ప్రసంగిస్తున్న మంత్రి సీతక్క

సీఎం పర్యటన ఇలా..

మధ్యాహ్నం 12:29 గంటలకు : హెలికాప్టర్ ద్వారా సీఎం మేడారం చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు మంత్రులు, ప్రజాప్రతినిధులు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు.

12:39 గంటలకు: గిరిజన సంప్రదాయ పద్ధతిలో కోయ నృత్యాకళాకారులతో డప్పు చప్పుళ్ల మధ్య సీఎంకు ఘనస్వాగతం పలికారు.

12:42: సీఎం రేవంత్‌రెడ్డి తులాభారం వేయగా 68 కిలోల బరువు రావడంతో నిలువెత్తు బంగారంతో (బెల్లం)పాటు అమ్మవార్లకు చీర–సారె సమర్పించేందుకు మంత్రులు, ఎమ్మెల్యేలతో మేడారం గద్దెల ప్రాంగణానికి చేరుకున్నారు.

12:44 గంటలకు: సమ్మక్క గద్దె వద్ద పూజారులు సీఎం రేవంత్‌రెడ్డికి ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా సమ్మక్క తల్లికి పూలదండ వేసి చీర–సారె సమర్పించి కొబ్బరికాయ కొట్టి మొక్కులు చెల్లించారు.

12:47 గంటలకు: సారలమ్మ దేవతను దర్శించుకుని చీర–సారె సమర్పించి కొబ్బరికాయ కొట్టి మొక్కులు చెల్లించారు.

12.53 గంటలకు: గోవిందరాజు, పగిడిద్ద రాజును సందర్శించి మొక్కులు చెల్లించారు.

12:55 గంటలకు : మేడారం గద్దెల ప్రాంగణంలో సీఎం రేవంత్‌రెడ్డితో పాటు మంత్రులు, పలువురు ఎమ్మెల్యేలను మంత్రి సీతక్క శాలువాలతో సన్మానించారు. అమ్మవార్ల బంగారాన్ని వారికి అందించారు.

12:59-1:04 గంటల వరకు : సమ్మక్క సారలమ్మ గద్దెల ప్రాంగణంలో చేపట్టనున్న అభివృద్ధి పనులను ముఖ్యమంత్రి పరిశీలించారు. పనులపై ఆరా తీసి మంత్రులకు కొన్ని సూచనలు చేశారు. రాత్రి పగలు కష్టపడితేనే 100 రోజుల్లో పనులు పూర్తవుతాయని, సకాలంలో పూర్తయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని మంత్రులు శ్రీనివాస్‌రెడ్డి, సీతక్కకు సూచించారు.

1:05 గంటలకు: మేడారం పూజారులతో ఇంటరాక్ట్ అయ్యారు. అభివృద్ధిలో పూజారులను భాగస్వాములను చేస్తున్నామని, ఆదివాసీ సంప్రదాయ పద్ధతిలోనే పనులు జరుగుతాయని సీఎం వారికి వెల్లడించారు.

1:15గంటలకు: పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో అధికారులతో సమీక్ష నిర్వహించారు.

2:08 గంటలకు: మేడారంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మహిళలను, భక్తులనుద్దేశించి సీఎం మాట్లాడారు. అదే వేదికపైనుంచి మేడారం మాస్టర్ ప్లాన్ డీపీఆర్‌ను ఆవిష్కరించారు. తల్లుల ప్రాంగణం ఏ విధంగా ఉంటుందో వీడియో రూపంలో ప్రదర్శించారు.

2:33 గంటలకు: మేడారం నుంచి హెలికాప్టర్ ద్వారా సీఎం తిరిగి హైదరాబాద్‌కు వెళ్లారు.



మరిన్ని ఫొటోలు : 8లో

జీఓ 12ను రద్దు చేయాలి

హన్మకొండ అర్బన్: భవన నిర్మాణ వెల్ఫేర్ బోర్డు ద్వారా అందించే స్కీంలను ప్రైవేట్ కంపెనీలకు ఇవ్వొద్దని కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు టి.ఉప్పలయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో బీసీడబ్ల్యూయూ వరంగల్ జిల్లా కార్యదర్శి అరూరి కుమార్ అధ్యక్షతన హనుమకొండ కలెక్టరేట్ ఎదుట భవన నిర్మాణ కార్మికులు పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్‌లో అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉప్పలయ్య మాట్లాడుతూ జూలై 22న జీఓ 12 విడుదల చేసి, రెండు రోజుల్లోనే రూ.346 కోట్లను ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలకు బదిలీ చేయడాన్ని తెలంగాణ రాష్ట్ర కార్మికులు తీవ్రంగా ఖండిస్తున్నారని పేర్కొన్నారు. తక్షణమే జీ12 ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే భవన నిర్మాణ కార్మికులను సమీకరించి రాష్ట్ర ప్రభుత్వ విధానాలను ఎండగడతామని హెచ్చరించారు. యునైటెడ్ బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు బానోత్ వెంకన్న, ఉపాధ్యక్షులు పుల్లా అశోక్, ఆలకుంట యాకయ్య, రాధ, స్వప్న, సారంగపాణి, సుధాకర్, వరంగల్ జిల్లా అధ్యక్షుడు కొమరయ్య, బ్రహ్మచారి, ఉప్పలయ్య తదితరులు పాల్గొన్నారు.



హనుమకొండ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న భవన నిర్మాణ కార్మికులు

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి

గ్రేటర్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్

వరంగల్ అర్బన్: అభివృద్ధి పనుల్లో పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించకుంటే బిల్లుల్లో కోత పెడతానని బల్దియా కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ అధికారులను హెచ్చరించారు. 31వ డివిజన్ దీన్‌దయాళ్ కాలనీ, 50వ డివిజన్‌లోని ఇందిరా కాలనీ, రాంపూర్, జవహర్ కాలనీ, గోపాల్ పూర్ తదితర ప్రాంతాల్లో సీసీ రోడ్లు, డ్రెయినేజీల నాణ్యతా ప్రమాణాలు, మెజర్‌మెంట్స్ బుక్స్ (ఎంబీ)ల ఆధారంగా పరిశీలించి కొలతలు వేయించారు. అనంతరం రాంపూర్ ప్రాంతంలో మొక్కలను కమిషనర్ పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఈఈ రవికుమార్, డీఈలు రాగి శ్రీకాంత్, రాజ్‌కుమార్, సారంగం, ఏఈ మేనక, ఉద్యాన విభాగం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



హనుమకొండలో అభివృద్ధి పనులు తనిఖీ చేస్తున్న కమిషనర్ చాహత్‌బాజ్‌పాయ్

కాలనీలు.. వరద కష్టాలు



ఇందిరమ్మ కాలనీలోకి భారీగా చేరిన వర్షపు నీరు



జాతీయ రహదారిపై నిలిచిన వరద

హన్మకొండ అర్బన్/హసన్‌పర్తి: నగరంలో సోమవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పలు కాలనీలు చెరువులను తలపించాయి. ప్రజలకు కునుకు కరువైంది. గ్రేటర్ 49వ డివిజన్‌లోని ఇందిరమ్మ కాలనీ నీటమునిగి ప్రజలు ఇబ్బందులు పడ్డారు. వర్షపు నీటితో బయటకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. అదే విధంగా హనుమకొండ–కరీంనగర్ ప్రధాన రహదారి చింతగట్టు క్యాంపు సమీపంలోని ఓఆర్‌ఆర్ వద్ద వరదనీరు చేరి వాహనదారులు, పాదచారులు అష్టకష్టాలు పడ్డారు. గుంతల్లో నీరు నిలిచి పలువురు వాహనదారులు అదుపుతప్పి పడిపోయారు.

గుప్పిట్లో రిజర్వేషన్ల గుట్టు!

- జెడ్పీటీసీ, ఎంపీటీసీల రిజర్వేషన్ల ఖరారు
- అధికారికంగా ప్రకటించని జిల్లా యంత్రాంగం
- షెడ్యూల్ వెలువడే వరకు రహస్యంగానే వివరాలు
- జిల్లాలో 129 ఎంపీటీసీ, 12 జెడ్పీటీసీ స్థానాలు



జిల్లా పరిషత్ కార్యాలయం

హన్మకొండ: స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధమవుతున్న ప్రభుత్వం స్థానిక సంస్థల రిజర్వేషన్లు ఖరారు చేసినట్లు తెలిసింది. అయితే ఖరారు చేసిన రిజర్వేషన్లను గుట్టుగా ఉంచింది. ప్రభుత్వం నుంచి వచ్చిన ఆదేశాల మేరకు జిల్లా అధికార యంత్రాంగం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించినట్లు సమాచారం. 2011 జనాభా లెక్కల ఆధారంగా ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు, బీసీ జనగణన ప్రకారం బీసీ రిజర్వేషన్లు ఖరారు చేశారు. జిల్లాలోని 12 జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాలు (జెడ్పీటీసీ), 129 మండల ప్రాదేశిక నియోజకవర్గాల (ఎంపీటీసీ)లు, 210 గ్రామ పంచాయతీలు, 1,986 వార్డులకు రిజర్వేషన్లు ఖరాయ్యాయి. వీటిని అధికారికంగా ప్రకటించలేదు. పంచాయతీ రాజ్ కమిషనర్ కార్యాలయం నుంచి జనాభా లెక్కల వివరాలు, జిల్లాలో ఎన్ని ప్రాదేశిక నియోజకవర్గాలు ఏఏ కేటగిరీలో రిజర్వేషన్లు కేటాయించాలి, మండలాల వారీగా ఎంపీటీసీ సంఖ్యను బట్టి ఏఏ కేటగిరీకి ఎన్ని నియోజకవర్గాలు కేటాయించాలో వివరాలు పంపించారు. అదేవిధంగా గ్రామ పంచాయతీలు, వార్డులకు సంబంధించిన రిజర్వేషన్ల వివరాలు పంపించారు. ఈ మేరకు జనాభా సంఖ్యను బట్టి రిజర్వేషన్లు ఖరారు చేసినట్లు తెలిసింది. జిల్లా పరిషత్ ఇన్‌చార్జ్ సీఈఓ, డిప్యూటీ సీఈఓ రవి, సిబ్బంది, ఎంపీడీఓలు, కలెక్టరేట్ సిబ్బంది హనుమకొండ కలెక్టరేట్‌లోని ప్రత్యేక గదిలో సోమ, మంగళవారం కసరత్తు చేశారు. జెడ్పీటీసీలు, మండలాల వారీగా ఎంపీటీసీ స్థానాలకు రిజర్వేషన్లు రూపొందించినట్లు తెలిసింది. జెడ్పీటీసీలకు మొదటిసారిగా (కొత్తగా) రిజర్వేషన్లు ఖరారు చేయగా.. ఎంపీటీసీలకు గత రిజర్వేషన్లను ప్రాతిపదికగా తీసుకుని రొటేషన్ పద్ధతిలో రిజర్వేషన్లు రూపొందించినట్లు సమాచారం. ఖరారైన రిజర్వేషన్లను ఎన్నికల షెడ్యూల్ వెలువడిన వెంటనే ప్రకటించనున్నట్లు ప్రచారం జరుగుతోంది. రిజర్వేషన్ల అంశంపై అధికారులు, ఉద్యోగులు మాట్లాడేందుకు సాహసించడం లేదు. ఎవరిని పలుకరించినా తమకేం తెలియదని చెబుతున్నారు. ఇప్పటికే జెడ్పీటీసీ, ఎంపీటీసీల వారీగా ఓటర్లు, పోలింగ్ స్టేషన్ల వివరాలను విడుదల చేశారు. జిల్లాలో మొత్తం ఓటర్లు 3,70,871 ఉండగా.. ఇందులో పురుషులు 1,80,666, మహిళలు 1,90,201, ఇతరులు నలుగురు ఉన్నారు. ఎల్కతుర్తి, హసన్‌పర్తి, ఐనవోలు, శాయంపేటలో ఒక్కరు చొప్పున ఇతరులున్నారు. జిల్లాలో పురుషులతో చూసుకుంటే 9,535 మంది మహిళా ఓటర్లు అధికంగా ఉన్నారు. ప్రతి మండలంలోను మహిళా ఓటర్లు ఎక్కువ సంఖ్యలో ఉండడం విశేషం. ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాల్లో 631 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశారు. జిల్లా ప్రాదేశిక నియోజకవర్గాలను మండలానికి ఒకటి చొప్పున గుర్తించారు. రిజర్వేషన్లు ఖరారు చేస్తున్నారనే ప్రచారం విస్తృతంగా జరుగడంతో గ్రామాల్లో రాజకీయాలు వేడెక్కాయి. రిజర్వేషన్లపై ఆశావహులు అంచనాలు వేసుకుంటున్నారు. తమకు అనుకూలంగా ఉంటాయా లేదా అని జనాభా లెక్కలను బట్టి బేరీజు వేసుకుంటున్నారు. మరో వైపు ఆశావహులు పోటీకి సన్నాహాలు చేసుకుంటున్నారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు పార్టీ గుర్తులపై జరుగనుండడంతో పార్టీ టికెట్ దక్కించుకునేందుకు వ్యూహాలు పన్నుతున్నారు. అధిష్టానం మెప్పు పొందేందుకు ఇప్పటి నుంచి ప్రయత్నాలు మొదలుపెట్టారు.

మండలాల వారీగా ఎంపీటీసీలు, ఓటర్లు, పోలింగ్ కేంద్రాల వివరాలు..

మండలం	ఎంపీటీసీలు	పోలింగ్ కేంద్రాలు	ఓటర్లు పురుషులు	మహిళలు	మొత్తం
ఆత్మకూరు	9	50	13,734	14,682	28,416
భీమదేవరపల్లి	14	69	20,444	21,454	41,898
దామెర	8	36	10,569	11,314	21,883
ధర్మసాగర్	13	65	18,705	19,708	38,413
ఎల్కతుర్తి	12	59	15,840	16,650	32,491
హసన్‌పర్తి	9	40	11,621	12,108	23,730
ఐనవోలు	13	59	16,855	17,633	34,489
కమలాపూర్	18	90	27,397	28,948	56,345
నడికూడ	10	47	13,348	14,137	27,485
పరకాల	5	26	7,312	7,790	15,102
శాయంపేట	12	61	16,642	17,395	34,038
వేలేరు	6	29	8,199	8,382	16,581

ఆయుర్వేదాన్ని వినియోగించుకోవాలి

నయింనగర్: ఆయుర్వేద వైద్య సేవలను వినియోగించుకోవాలని ఆయుష్ ప్రాంతీయ ఉప సంచాలకురాలు డాక్టర్ ప్రమీలాదేవి అన్నారు. జాతీయ ఆయుర్వేద దినోత్సవాన్ని పురస్కరించుకొని 53వ డివిజన్ సమ్మయ్యనగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆమె హాజరై మాట్లాడుతూ ఆహార పదార్థాలు కలుషితమైపోతున్న తరుణంలో ఆయుర్వేద వైద్యం ఎంతో ఉపయుక్తమన్నారు. ఒత్తిడి అధిగమించడానికి యోగా ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు.

బ్రహ్మచారిణిగా భ్రమరాంబిక అమ్మవారు

ఐనవోలు: దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఐనవోలు శ్రీభ్రమరాంబిక అమ్మవారు రెండో రోజు మంగళవారం బ్రహ్మచారిణి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం సుప్రభాత సేవ, నిత్యాహ్నికం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. తొమ్మిది రోజులు అమ్మవారు రోజుకో అలంకరణలో దర్శనమిస్తారని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని ఉప ప్రధాన అర్చకుడు పాతర్లపాటి రవీందర్ కోరారు. కార్యక్రమంలో చైర్మన్ కమ్మగోని ప్రభాకర్‌గౌడ్, ముఖ్య అర్చకులు పాతర్లపాటి శ్రీనివాస్, ఐనవోలు మధుకర్ శర్మ, వేద పండితులు గట్టు పురుషోత్తమ శర్మ, విక్రాంత్ వినాయక్ జోషి, అర్చకులు నందనం భానుప్రసాద్, మధు శర్మ, శ్రీనివాస్, నరేశ్‌శర్మ, దేవేందర్, ధర్మకర్తల మండలి సభ్యులు, సిబ్బంది, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



బ్రహ్మచారిణి అలంకరణలో దర్శనమిస్తున్న భ్రమరాంబిక అమ్మవారు



క్లుప్తంగా

15నుంచి బీటెక్ ఫస్టియర్ సప్లిమెంటరీ పరీక్షలు

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ పరిధిలో బీటెక్ ఫస్టియర్ (నాన్ సీబీసీఎస్) అన్ని బ్రాంచ్‌ల విద్యార్థులకు అక్టోబర్ 15వ తేదీ నుంచి సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి కె. రాజేందర్, అదనపు పరీక్షల నియంత్రణాధికారి ఆసిం ఇక్బాల్ మంగళవారం తెలిపారు. అక్టోబర్ 15,18, 21, 23, 27, 30, నవంబర్ 3వ తేదీల్లో పరీక్షలు నిర్వహించనున్నామన్నారు. ఆయా తేదీల్లో పరీక్షలు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు.

8 నుంచి ఎల్ఎల్ఎం రెండో సెమిస్టర్ పరీక్షలు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఎల్ఎల్ఎం రెండో సెమిస్టర్ పరీక్షలు (రెగ్యులర్,ఎక్స్,ఇంప్రూవ్‌మెంట్) అక్టోబర్ 8వ తేదీనుంచి నిర్వహించనున్నట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి కె. రాజేందర్, అదనపు పరీక్షల నియంత్రణాధికారి ఆసిం ఇక్బాల్ మంగళవారం తెలిపారు. అక్టోబర్ 8న పేపర్-1, 10న పేపర్ -2, 14న పేపర్ -3 పరీక్షలు నిర్వహిస్తామని, ఆయా తేదీల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తామని వారు పేర్కొన్నారు.

నేడు జిల్లా స్థాయి ఉషూ ఎంపికలు

వరంగల్ స్పోర్ట్స్ : ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి అండర్ -17, -19 విభాగాల్లో బాలబాలికల ఉషూ ఎంపికలు బుధవారం నగరంలోని జవహర్ లాల్ నెహ్రూ స్టేడియంలో నిర్వహించనున్నట్లు హనుమకొండ జిల్లా ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ వి.ప్రశాంత్‌కుమార్ మంగళవారం తెలిపారు. ఈ ఎంపికల్లో పాల్గొనే క్రీడాకారులు ఉదయం 9 గంటలకు తమ డేట్ ఆఫ్ బర్త్ సర్టిఫికెట్, ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలు, ఎస్సెస్సీ మార్కుల మెమో(అండర్ -19 క్రీడాకారులు) తో స్టేడియంలో రిపోర్టు చేయాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 98664 50592, 98497 60799 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

యూరియా వచ్చేసింది..

ఖిలా వరంగల్: వరంగల్ రైల్వే గూడ్స్ షెడ్‌కు మంగళవారం ఇఫ్కో కంపెనీ చెందిన 1,008 మెట్రిక్ టన్నుల 10,26,26 రకం ఎరువులు చేరాయి. ఈ ఎరువులను వ్యవసాయ అధికారులు విజ్ఞాన్, రవీందర్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా దిగుమతి చేసుకున్న ఎరువులను ఉమ్మడి జిల్లాలోని మార్క్‌ఫెడ్‌కు 60 శాతం, ప్రైవేట్ ఫర్టిలైజర్ షాపులకు 40శాతం పంపించినట్లు వ్యవసాయ అధికారి రవీందర్ రెడ్డి తెలిపారు.

యువజన సంఘాల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

న్యూశాయంపేట: భారత ప్రభుత్వం ఆధ్వర్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలో యువజన సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించడానికి యువజన సంఘాల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మేరా భారత్ డిప్యూటీ డైరెక్టర్ చింతల అన్వేష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. యువజన సంఘాల సమన్వయంతో ప్రభుత్వ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో చేపట్టే కార్యక్రమాలకు యువజన సంఘంలోని సభ్యుల వయసు 18 నుంచి 29 సంవత్సరాల లోపు ఉండాలన్నారు. సంఘాల రిజిస్ట్రేషన్ చేసుకున్నా లేదా చేయకున్నా ఆసక్తి గల సంఘాలు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. పూర్తి వివరాలకు హనుమకొండ బస్టాండ్ సమీపంలోని యువజన సంఘాల కార్యాలయంలో ఈనెల 27లోగా సంప్రదించి నమోదు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 0870-2958776 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

కుంటలో యువకుడి గల్లంతు

● గంట్లకుంటలో విషాద ఘటన


అశోక్(ఫైల్)

పెద్దవంగర: కుంటలో ఓ యువకుడు గల్లంతయ్యాడు. ఈ ఘటన మంగళవారం మండలంలోని గంట్లకుంట పరిధిలో చింతల కుంటలో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. పెద్దవంగర మండలం అవుతాపురం గ్రామానికి చెందిన కమ్మగాని అశోక్ (35) కేబుల్ ఆపరేటర్‌గా, ఆటో నడుపుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఈ క్రమంలో మండలంలోని గంట్లకుంట గ్రామ పరిధి చింతల కుంటలోని స్తంభానికి ఏర్పాటు చేసిన డిష్‌వైర్ మరమ్మతు కోసం నెల్లికుదురు మండలం బ్రహ్మణ కొత్తపల్లికి చెందిన పెమమాండ్ల శ్రీనివాస్‌తోపాటు మరో ఇద్దరు కలిసి వెళ్లారు. ఈ క్రమంలో తెప్ప మునుగడంతో ఈతరాని అశోక్ నీటిలో మునిగి గల్లంతయ్యాడు. సమాచారం అందుకున్న తహసీల్దార్ మహేందర్, ఎస్సై క్రాంతికిరణ్ ఘటనాస్థలికి చేరుకుని రెస్క్యూ టీం, గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టినా అశోక్ ఆచూకీ లభించలేదు. అశోక్ భార్య కనకతార ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై క్రాంతికిరణ్ తెలిపారు.

సీఓఈ.. హుష్‌కాకి

కరీంనగర్‌కు తరలిన సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ బాలుర కళాశాల

● సెంటర్ మార్పుతో ఆందోళనలో విద్యార్థులు, తల్లిదండ్రులు
● క్షేత్రస్థాయి అధికారుల ముందస్తు ప్రణాళిక లేమితో ఫలితాలు శూన్యం

న్యూశాయంపేట : ఎన్నో ఆశలు, ఆశయాలతో మైనారిటీ గురుకులాల విద్యాసంస్థ సొసైటీ(టెమ్రిస్) ఆధ్వర్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా రెండు సీఓఈ (సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ) కళాశాలలు ఏర్పాటు చేశారు. పేద విద్యార్థులకు ఇంటర్మీడియట్ విద్యతోపాటు ఐఐటీ, నీట్, జేఈఈ వంటి పోటీ పరీక్షల్లో ప్రత్యేక శిక్షణ ఇప్పించి ఉన్నత శిఖరాలు అధిరోహించడానికి సీఓఈలు తోడ్పడుతాయని భావించారు. ఒకటి బాలికలకు, మరోటి బాలురకోసం ఏర్పాటు చేస్తున్నట్లు అధికారుల హడావుడిగా ప్రకటించారు. అయితే ముందస్తు ప్రణాళికలు లేకుండా సీఓఈలను ఏర్పాటు చేయడంతో అధికారులు అభాసుపాలవుతున్నారు. టెమ్రిస్ ఉన్నతాధికారుల ఆకాంక్షల కనుగుణంగా విధులు నిర్వర్తించాల్సిన క్షేత్రస్థాయి అధికారుల అలసత్వంతో విద్యార్థులు చేరకపోవడంతో రెండు సీఓఈలలో ఒక సెంటర్(బాలుర) కరీంనగర్‌కు మార్పు చేస్తూ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఫలితంగా సెంటర్ మార్పుతో విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. కాగా, హనుమకొండ కేయూ క్రాస్ రోడ్‌లో బాలికల గురుకులంలో బాలికలకు సీఓఈ కళాశాల ఏర్పాటు చేశారు.

సీఓఈల ఏర్పాటు ఉద్దేశం..

విద్యార్థుల భవిష్యత్‌కు బాటలు వేయడానికి ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా 15 సెంటర్లు ఏర్పాటు చేసింది. కేవలం పాఠ్యపుస్తకాలతో సరిపెట్టకుండా జేఈఈ, నీట్, ఎంసెట్ తదితర పోటీ పరీక్షల్లో ప్రతిభ కనబరిచేందుకు ప్రత్యేక కోచింగ్ ఇవ్వాలని నిర్ణయించింది. ఇందుకోసం నిపుణులను తీసుకుని కోచింగ్ ఇవ్వనుంది. అకడమిక్ నైపుణ్యాలు కాకుండా లైఫ్, కమ్యూనికేషన్ స్కిల్స్ తదితర అంశాల్లో నిరంతరం శిక్షణ ఇవ్వడానికి ప్రత్యేకంగా సీఓఈలు ఏర్పాటు చేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లాకు రెండు సీఓఈలు మంజూరుకాగా ఒకటి వరంగల్ జక్కలొద్ది గురుకులంలో బాలుర కోసం, మరోటి హనుమకొండ కేయూ క్రాస్‌రోడ్‌లో గురుకులంలో బాలికల కోసం ఏర్పాటు చేసి విద్యార్థుల ప్రవేశానికి గత నెల 3న ప్రత్యేక పరీక్ష నిర్వహించింది.

ముందస్తు ప్రణాళిక లేమితో ఫలితాలు శూన్యం..

విద్యాసంవత్సరం ప్రారంభమైన రెండు నెలల అనంతరం సెంటర్లు ప్రారంభించారు. అయితే ప్రణాళిక లేమి కారణంగా అధికారుల నిర్ణయాలు అభాసుపాలవుతున్నాయని మేధావులు, విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు. దీర్ఘకాలిక వ్యూహం లేకుండా హడావుడి నిర్ణయాలు తీసుకోవద్దని వారు పేర్కొంటున్నారు. విద్యార్థులను ఏఏ రంగాల్లో తీర్చిదిద్దాలనుకుంటున్నారో ముందుగానే నిర్ణయించుకోవాలంటున్నారు. పాఠశాల స్థాయి నుంచే జేఈఈ, ఐఐటీ, నీట్ కోసం సన్నద్ధం విద్యార్థుల భవిష్యత్‌కు బాటలు వేస్తుందని, దీని కోసం టెమ్రిస్ అధికారులు కృషి చేయాలని సూచిస్తున్నారు. ఇంటర్ స్థాయిలో పరీక్షల ఒత్తిడి ఎక్కువగా ఉంటుంది. అదే పాఠశాల స్థాయి నుంచే సిద్ధం చేయడం వల్ల విద్యార్థులు ఒత్తిడి లేకుండా ఉంటారు. క్రమంగా నేర్చుకుని సత్ఫలితాలు సాధిస్తారని నిపుణులు పేర్కొంటున్నారు.

వరంగల్‌లోనే ఏర్పాటు చేయాలి



పేద విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన సీఓఈ సెంటర్‌ను వరంగల్‌లో ఏర్పాటు చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. ఉమ్మడి వరంగల్ జిల్లా విద్యార్థులు కరీంనగర్‌కు వెళ్లడానికి ఎన్నో వ్యయప్రయాసలు ఎదుర్కోవాల్సి వస్తుంది. పాఠశాల స్థాయి నుంచే పోటీ పరీక్షలకు సన్నద్ధం కోసం చర్యలు తీసుకోవాలి

అబ్దుల్ ఖుద్దూస్, సామాజిక వేత్త

విద్యార్థుల ఎంపిక...

సీఓఈ కళాశాలల్లో ప్రవేశానికి ప్రత్యేకంగా వరంగల్ జక్కలొద్దిలో, హనుమకొండ గురుకులాల్లో పరీక్షలు నిర్వహించారు. ఐఐటీ కోసం బాలికల కళాశాలలో 87 మంది, నీట్ కోసం 62 మంది, బాలుర కళాశాలలో ఐఐటీ కోసం 70 మంది, నీట్‌లో శిక్షణ కోసం 27 మంది మొత్తం ఐఐటీ కోసం 157 మంది, నీట్ కోసం 89 మంది విద్యార్థులు ఎంపికయ్యారని అధికారులు ప్రకటించారు. తీరా ఫలితాలు ప్రకటించాక విద్యార్థులు తక్కువ ఉన్నారనే నెపంతో అధికారులు బాలుర సెంటర్‌ను రద్దు చేస్తున్నట్లు ప్రకటించి కరీంనగర్ సెంటర్‌కు వెళ్లాలని తెలుపడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

ప్రొసీడింగ్ కాపీ ఇచ్చారు.. బిల్లు రాదంటున్నారు!

● ప్రొసీడింగ్ కాపీకి రూ.2వేలు వసూలు చేసిన పంచాయతీ కార్యదర్శి
● బిల్లు రాదని చెప్పడంతో బయటపడిన వ్యవహారం


సుగుణకు మంజూరైన ఇందిరమ్మ ఇల్లు పత్రం

గంగారం : ఇందిరమ్మ ఇల్లు వచ్చిందని చెప్పి.. ముగ్గు పోయించి.. ప్రొసీడింగ్ కాపీ అందించి 20 రోజులు గడుస్తోంది. అయితే ఈ సమయంలో మీకు బిల్లు రాదు.. ఇల్లు నిర్మించుకోవద్దని పంచాయతీ కార్యదర్శి చెప్పడంతో లబ్ధిదారు కన్నీరుమున్నీరవుతోంది. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా గంగారం మండలం పుట్టలభూపతిలో చోటుచేసుకుంది. బాధితురాలి కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన సోలెం సుగుణకు ఇందిరమ్మ ఇల్లు మంజూరైంది. 20 రోజుల క్రితం ఇంటి నిర్మాణం ముగ్గు పోసి పనులు ప్రారంభించారు. ఆ సమయంలో రూ. 2వేలు పంచాయతీ కార్యదర్శి గోపికి అందించగా ప్రొసీడింగ్ కాపీ ఇచ్చాడు. ఇంటి పనులు జరుగుతుండగా మంగళవారం వచ్చి మీకు ఇందిరమ్మ బిల్లు రాదని తేల్చిచెప్పాడు. మీ సమీపంలోనే మరో ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం జరుగుతుందని, అందుకే మీ ఇంటి నిర్మాణ పనులను ఆపివేయాలని చెప్పా డు. దీంతో ఇందిరమ్మ ఇల్లు వచ్చిందని, నిర్మాణం చేసుకోవాలని చెప్పి ఇప్పుడు మాట దాటేస్తున్నావంటూ సుగుణ.. పంచాయతీ కార్యదర్శిని నిలదీ యడంతో అక్కడి నుంచి వెళ్లిపోయాడు. వెంటనే జీపీ వద్దకు వెళ్లి తాను ఇచ్చిన రూ. 2 వేలు తనకు ఇవ్వాలని, తనకు ఇందిరమ్మ ఇల్లు వద్దని సుగుణ చెప్పడంతో విషయం బయటపడింది. ఇందిరమ్మ ఇళ్ల విషయంలో పంచాయతీ కార్యదర్శి గోపి లబ్ధిదారుల వద్ద నుంచి రూ. 2వేలు ఎలా వసూలు చేస్తారని పలువురు విమర్శిస్తున్నారు. ఈవిషయంపై ఉన్నతాధికారులు ఏ చర్యలు తీసుకుంటారో చూడాల్సిందే. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి గోపిని వివరణ కోరేందుకు ఫోన్ చేయగా లిఫ్ట్ చేయలేదు. కాగా, ఆదివాసీ మహిళను దూషించిన పంచాయతీ కార్యదర్శిని వెంటనే విధుల నుంచి తొలగించాలని ఆదివాసీ సంఘాలు డిమాండ్ చేశాయి.

కాశికుంటలో మహిళ ఆత్మహత్య

ఖిలా వరంగల్ : అనారోగ్య కారణాలతో మనస్తాపం చెందిన ఓ మహిళ యాసిడ్ తాగి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన మంగళవారం వరంగల్ 41వ డివిజన్ నాగేంద్రనగర్ కాశికుంటలో చోటు చేసుకుంది. నాగేంద్రనగర్‌కు చెందిన పిట్ట పద్మ (65) కొంత కాలం నుంచి నడుం నొప్పితో బాధపడుతోంది. నొప్పి ఎంతకూ తగ్గడం లేదు. దీంతో మనస్తాపం చెంది యాసిడ్ తాగింది. కుటుంబీకులు గమనించి వెంటనే 108లో ఎంజీఎం తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి కుమార్తె బిజ్జ శారద ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ రమేశ్ తెలిపారు.

దాసరిపల్లిలో యువకుడు..

నర్సంపేట రూరల్ : ఓ యువకుడు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మంగళవారం నర్సంపేట మండలం దాసరిపల్లిలో చోటుచేసుకుంది. నర్సంపేట రూరల్ ఎస్సై గూడ అరుణ్ కథనం ప్రకారం.. నల్లబెల్లి మండలం నందిగామచెందిన కంచ చంద్రశేఖర్ (23) తన అమ్మమ్మ గ్రామం నర్సంపేట మండలం దాసరిపల్లికి వచ్చాడు. ఈ క్రమంలో సోమవారం రాత్రి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి తండ్రి కంచ రవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సైతెలిపారు. చంద్రశేఖర్ మృతికి సంబంధించిన వివరాలు తెలియాల్సి ఉంది.

చెర్లపాలెంలో వ్యక్తి ..

తొర్రూరు రూరల్: గొంతు కోసుకుని ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మంగళవారం మండలంలోని చెర్లపాలెంలో చోటు చేసుకుంది. ఎస్సై ఉపేందర్ కథనం ప్రకారం.. ఏడాది క్రితం గ్రామానికి చెందిన సింగరావు కొమ్మాలు(59), జ్యోతి దంపతులు గొడవ పడ్డారు. అప్పటి నుంచి జ్యోతి తన పుట్టింటి వద్ద ఉంటోంది. దీంతో ఒంటరిగా జీవిస్తున్న కొమ్మాలు మద్యానికి బానిసయ్యాడు. భార్య కాపురానికి రావడం లేదనే మనస్తాపంతో బ్లేడ్‌తో గొంతు కోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. స్థానికులు గమనించి వెంటనే వరంగల్ ఎంజీఎం తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. భార్య జ్యోతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మహిళను తండ్రి చెంతకు చేర్చిన 'సఖీ'


జబీన్‌ను కుటుంబీకులకు అప్పగిస్తున్న సఖీ అడ్మినిస్ట్రేటర్ శ్రీలత

ఖానాపురం: ఇంటి నుంచి పారిపోయి వచ్చిన మానసిక స్థితి లేని మహిళకు సఖీ సెంటర్ నిర్వాహకులు ఆశ్రయం కల్పించారు. ఖానాపురం మండలం బుధరావుపేటతోపాటు పలు గ్రామాల్లో కొద్ది రోజులుగా గుర్తుతెలియని మహిళ ఒంటరిగా సంచరిస్తోంది. దీంతో ఆయా గ్రామాల ప్రజలు పోలీసులకు సమాచారం అందించగా ఎస్సై రఘుపతి.. మానసిక స్థితిలేని సదరు మహిళను ఈనెల 20వ తేదీన వరంగల్‌లోని సఖీ సెంటర్‌కు తీసుకెళ్లారు. సఖీ సెంటర్ నిర్వాహకులు తాత్కాలిక వసతి కల్పించి కౌన్సెలింగ్ నిర్వహించారు. ఇందులో సదరు మహిళ తన పేరు మోబీనా జబీన్ అని, కర్నూలు జిల్లా వడ్డగిరి అని తెలపడంతో వివరాలు గుర్తించే ప్రయత్నం చేసినా ఫలితం కనిపించ లేదు. దీంతో ఆంధ్రప్రదేశ్ మహిళా హెల్ప్‌లైన్ ద్వారా వివరాలు సేకరించారు. కర్నూలు జిల్లా సఖీ సెంటర్ ద్వారా పలు పోలీస్‌స్టేషన్లకు ఫొటోలు పంపగా మహానంది పోలీస్‌స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదైనట్లు తెలుసుకున్నారు. మహానంది పోలీసులు సహకారంతో జబీన్‌ను తండ్రి మహబూబ్‌పాషాను వరంగల్‌కు పిలిపించి సఖీ సెంటర్ అడ్మినిస్ట్రేటర్ శ్రీలత ఆధ్వర్యంలో జబీన్‌ను మంగళవారం అప్పగించారు.


పదవులకన్నా.. ప్రజా సంబంధాలే మిన్నా


మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

● నూకల నరేశ్‌రెడ్డి స్మృతివనం ప్రారంభోత్సవంలో మంత్రి తుమ్మల

సాక్షి, మహబూబాబాద్/ మరిపెడ రూరల్: 'ప్రతీ మనిషి తన జీవిత కాలంలో అనేక రకాల పదవులను చేపడుతారు. అనేక రంగాల్లో రాణించడం వంటి సంఘటనలు చోటు చేసుకుంటాయి. ఎన్ని పదవులు చేపట్టామనేది కీలకం కాదు. ఎంతమేరకు ప్రజా సంబంధాలను పెంపొందించుకున్నాం.. మనం చేసిన పనులతో ఎంత మంది గుండెల్లో నిలిచిపోయాం అన్నదే కీలకం' అని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం పురుషోత్తమాయగూడెంలోని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఏరువాక నూకల నరేశ్‌రెడ్డి స్మృతివనంలో ఏర్పాటు చేసిన ఆయన (నూకల నరేశ్‌రెడ్డి) విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తుమ్మల మాట్లాడుతూ ఏ పార్టీలో పనిచేసినా నిబద్ధతో పని చేసిన వ్యక్తి నరేశ్‌రెడ్డి రెడ్డి అని పేర్కొన్నారు. నరేశ్‌రెడ్డి భౌతికంగా లేకపోయినా ఈ ప్రాంత ప్రజల గుండెల్లో ఎప్పటికీ చిరస్థాయిగా నిలుస్తారన్నారు. ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి, వరంగల్ మాజీ ఎంపీ రామసహాయం సురేందర్ రెడ్డి మాట్లాడుతూ పదవులు రాకపోయినా ప్రత్యేక సైన్యం తయారు చేసుకొని ప్రజలకు చేరువైన నాయకుడు నరేశ్‌రెడ్డి అన్నారు. కార్యక్రమంలో డోర్నకల్ ఎమ్మెల్యే రాంచంద్రునాయక్, మాజీ మంత్రి రాథోడ్ సత్యవతి, మాజీ ఎమ్మెల్యే శంకర్ నాయక్, మార్తినేని ధర్మారావు, ఎర్రబెల్లి స్వర్ణ, ఖమ్మం ఎమ్మెల్సీ తాతమధు, డీసీసీ జిల్లా అధ్యక్షుడు జన్నారెడ్డి భరత్‌చంద్రారెడ్డి, రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ సభ్యులు మాలోత్ నెహ్రూనాయక్, గ్రంథాలయ సంస్థ జిల్లా మాజీ చైర్మన్ గుడిపూడి నవీన్, ఓడీసీఎంఎస్ మాజీ చైర్మన్ మహేందర్‌రెడ్డి, నాయకులు ముద్వా విజయ్‌బాబు, నూకల కిషన్‌రెడ్డి, వంటికొమ్ము యుగేంధర్‌రెడ్డి, పెండ్లి రఘువీరరెడ్డి, తాజుద్దీన్, నరేశ్ రెడ్డి కుమారులు అభినయ్ రెడ్డి, అనిరుధ్‌రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ సంస్కృతికి ప్రతీక బతుకమ్మ


మాట్లాడుతున్న తెలుగు యూనివర్సిటీ పూర్వ రిజిస్ట్రార్లు భక్తవత్సలరెడ్డి, రమేశ్

హన్మకొండ కల్చరల్ : బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతీ, ఆడపడుచుల గౌరవానికి ప్రతీకకని, తెలుగింటి ఆడబిడ్డే బతుకమ్మ అని తెలుగు యూనివర్సిటీ పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య నాగపట్ల భక్తవత్సలరెడ్డి అన్నారు. మంగళవారం వరంగల్ సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం జానపద గిరిజన విజ్ఞాన పీఠంలో బతుకమ్మ ఆటాపాటల సంబురాలు నిర్వహించారు. పీఠాధిపతి డాక్టర్ గడ్డం వెంకన్న ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ రిజిస్ట్రార్లు ప్రొఫెసర్ భక్తవత్సలరెడ్డి, ప్రొఫెసర్ భట్టు రమేశ్ ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడుతూ మన సంస్కృతీ, సంప్రదాయాలు, ప్రాచీన కళలు కాపాడుకోవాలని, భావితరాలకు అందించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పీఠం అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ శ్రీమంతుల దామోదర్, డాక్టర్ సురేశ్, గోపాల్‌రెడ్డి, చూరేపల్లి రవి, నోముల రాజు, సునీత, డాక్టర్ సతీశ్, తదితరులు పాల్గొన్నారు.

మేడారంలో సీఎం రేవంత్ పర్యటన



మేడారం పూజారులతో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు పొంగులేటి, సీతక్క, కొండా సురేఖ


మేడారం మాస్టర్‌ప్లాన్ చిత్రాలను తిలకిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు పొంగులేటి, సీతక్క తదితరులు


సీఎం రేవంత్‌రెడ్డికి కొమ్ముకోయ నృత్యంతో స్వాగతం పలుకుతున్న గొత్తికోయ కళాకారులు


ఆదివాసీలు బహూకరించిన కొమ్ముల కిరీటం, నెమలి పింఛాలతో సీఎం రేవంత్ రెడ్డి, పక్కన మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు


తల్లులకు తులాభారం వేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి. పక్కన మంత్రులు ధనసరి సీతక్క, కొండా సురేఖ, అడ్లూరి లక్ష్మణ్

నాకోసం కాదు.. నీకోసం



కేయూ పరిధిలో శ్రమదానం చేస్తున్న ఎన్ఎస్ఎస్ వలంటీర్లు (ఫైల్)

● నేడు జాతీయ సేవాపథకం (ఎన్ఎస్ఎస్) దినోత్సవం
● కేయూ పరిధిలో 356 యూనిట్లు.. 35,600 మంది వలంటీర్లు

కేయూ క్యాంపస్: నాకోసం కాదు.. నీకోసం (నాట్ మి బట్ యూ) అనే నినాదంతో జాతీయ సేవాపథకం (ఎన్ఎస్ఎస్) ద్వారా సామాజిక సేవా కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. మహాత్మాగాంధీ శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని 1969 సెప్టెంబర్ 24న దేశవ్యాప్తంగా జాతీయ సేవాపథకాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టింది. బుధవారం ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కథనం..

కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని 11 జిల్లాల్లో ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్ జూనియర్ అండ్ డిగ్రీ, పీజీ కళాశాలలు కలిపి 356 ఎన్ఎస్ఎస్ యూనిట్లు ఉన్నాయి. ఒక్కో యూనిట్‌కు 100 మంది చొప్పున మొత్తం 35,600 ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ఉన్నారు. ఎన్ఎస్ఎస్ కార్యక్రమా ల్లో ప్రధానంగా క్లీన్ అండ్ గ్రీన్, శ్రమదానం, మొక్కలు నాటడం, సామాజిక రుగ్మతలపై చైతన్యపరచడం, మూఢనమ్మకాలు, ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీలు, రక్తదాన శిబిరాలు తదితర కార్యక్రమాలు నిర్వహిస్తారు. కళాశాలల్లోని ఒక్కో యూనిట్‌కు రూ. 27,500, అదేవిధంగా ఏదైనా గ్రామంలో ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తే ఒక్కొ యూనిట్‌కు (50 మంది ఎన్ఎస్ఎస్‌వలంటీర్లు) రూ.35 వేలు చెల్లిస్తారు.

కేయూకు రూ.61 లక్షల నిధులు

ఈ విద్యాసంవత్సరంలో కేయూకు కేంద్ర ప్రభుత్వం రూ.61 లక్షల నిధులు విడుదల చేసింది. కేయూలో అన్ని యూనిట్లకు కలిపి ప్రతీ విద్యాసంవత్సరంలో రూ.2.67 లక్షల చొప్పున విడుదల కావాల్సి ఉంది. మూడేళ్లుగా అంతంత మాత్రంగానే నిధులు విడుదల చేస్తున్నారు. నిబంధనలతో ఆ నిధులను సరిగా వినియోగించుకోలేకపోతున్నారు. రూ.61 లక్షల నిధులను ఈనెల 27వ తేదీలోపు అడ్వాన్స్ రూపంలోనైనా వినియోగించుకోవాలి. మొదటి విడత ఈ నిధులు వినియోగించుకుంటేనే రెండో విడత నిధులు విడుదల చేస్తారు. వ్యయం చేయకపోతే ఆయా నిధులు వెనక్కివెళ్లే అవకాశం ఉంటుంది. మైభారత్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ అయిన కళాశాలల ఎన్ఎస్ఎస్ యూనిట్లకే నిధులు విడుదల చేస్తున్నారు. అందులో కూడా యాక్టివ్‌గా ఎన్ఎస్ఎస్ కార్యక్రమాలు నిర్వహిస్తున్న కళాశాలల యూనిట్లకే ఈనిధులు విడుదల చేశారు. గత ఏడాది యూనివర్సిటీ స్థాయి యువజనోత్సవాలు కూడా నిర్వహించలేదు.

త్వరలోనే అడ్వైజరీ కమిటీ సమావేశం



కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని ఎన్ఎస్ఎస్ యూనిట్ల అడ్వైజరీ కమిటీ సమావేశం త్వరలోనే నిర్వహిస్తాం. ఈ విద్యాసంవత్సరానికి కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.61 లక్షలు ఇటీవల విడుదల అయ్యాయి. నిధుల వినియోగంపై కూడా ఎన్ఎస్ఎస్ రాష్ట్ర అబ్జర్వర్ జూమ్ మీటింగ్ ద్వారా కూడా ఇటీవలే తెలియజేశారు. ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని కళాశాలలు, ప్రత్యేక శిబిరాల్లోనూ నిర్వహిస్తారు.

- ఈసం నారాయణ, కేయూ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్

సృష్టిని కాపాడే దేవత రుద్రేశ్వరి


అమ్మవారి మండపం ఎదుట చండీహోమం నిర్వహిస్తున్న వేదపండితుడు

హన్మకొండ కల్చరల్: సకల సంపదలు ప్రసాదించి, సృష్టిని కాపాడే సకలదేవతా స్వరూపిణి రుద్రేశ్వరీదేవి అమ్మవారు అని వేయిస్తంభాల దేవాలయ ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ అన్నారు. శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా వేయిస్తంభాల ఆలయంలో మంగళవారం రెండోరోజు అమ్మవారిని అన్నపూర్ణగా అలంకరించారు. గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో అర్చకులు ఉదయం శ్రీరుద్రేశ్వరస్వామికి అభిషేకాలు, రుద్రార్చనలు చేశారు. అనంతరం అమ్మవారి మండపం ముందు కృష్ణయజుర్వేద పండితుడు గుదిమెళ్ల విజయకుమారాచార్య గణపతినవగ్రహ రుద్రసహిత సుదర్శన సహిత చండీయాగం నిర్వహించారు. సీఎంఆర్ షాపింగ్ మాల్ వారు అన్నప్రసాద వితరణ చేశారు. తాడూరి రేణుక బృందం చేసిన కూచిపూడి నృత్యాలు అలరించాయి. దేవాదాయ ధర్మాదాయశాఖ రీజినల్ జాయింట్ కమిషనర్ మల్లెల రామకృష్ణారావు, రెడ్ క్రాస్ సంస్థ సభ్యులు ఈవీ శ్రీనివాసరావు అమ్మవారిని దర్శించుకున్నారు. సేవా సమితి సభ్యులు రవీందర్‌రెడ్డి, కోన శ్రీకర్ భక్తులకు సేవలందించారు. ఈఓ అనిల్‌కుమార్ పర్యవేక్షించారు.

భర్త మరణం తట్టుకోలేక భార్య మృతి

● మల్కాపూర్‌లో ఘటన


యాదమ్మ (ఫైల్)

చిల్పూరు: భర్త మరణం తట్టుకోలేక భార్య మృతి చెందింది. మనోవేదనతో భర్త చనిపోయిన ఏడు రోజులకే కన్నుమూసింది. ఈ ఘటన జనగామ జిల్లా చిల్పూరు మండలం మల్కాపూర్‌లో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ఎలిశాల వెంకటయ్య ఈనెల 17వ తేదీన మృతి చెందాడు. అప్పటి నుంచి మనోవేదనకు గురవుతున్న భార్య యాదమ్మ (67) మంగళవారం ఉదయం మృతి చెందింది. కాగా, మృతురాలి కుమారుడు రాజు, శ్రీనివాస్, కుమార్తెలు రమ, రజని కోరిక మేరకు అల్లుడు డాక్టర్ ఉల్లెంగుల కుమారస్వామి సదాశయ ఫౌండేషన్‌కు సమాచారం ఇవ్వగా వారు ఎల్‌వీపీ టెక్నీషియన్ నరేందర్ సహకారంతో మృతురాలి కార్నియాలు సేకరించి హైదరాబాద్‌లోని 'ఐ' బ్యాంకుకు పంపించారు.

విద్యుదాఘాతంతో కేబుల్ ఆపరేటర్..


ఓదెలు(ఫైల్)

టేకుమట్ల: విద్యుదాఘాతంతో ఓ కేబుల్ ఆపరేటర్ మృతి చెందాడు.ఈ ఘటన మంగళవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం అంకుషాపూర్‌లో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కేబుల్ టీవీ ఆపరేటర్ సాద ఓదెలు(50) విద్యుత్ స్తంభంపై గల డిష్ వైరును అమర్చుతున్నాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు పైనున్న 11కేవీ విద్యుత్ వైరుకు తాకడంతో షాక్‌కు గురై సీసీ రోడ్డుపై పడడంతో తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై దాసరి సుధాకర్ తెలిపారు.